క్లుప్తంగా

రైతు సేవా కేంద్రాల్లో యూరియా



రైతు సేవా కేంద్రంలో ఉన్న యూరియా

గుడిపాల: రైతులకు అందుబాటులో యూరియా ఉంచినట్లు వ్యవసాయాధికారి మాధవి తెలిపారు. మండల కేంద్రంతోపాటు పాపసముద్రం, గుముట్టుకూరుపల్లె, పానాటూరు రైతు సేవా కేంద్రాల్లో అగ్రికల్చర్ అసిస్టెంట్ వద్ద యూరియా పొందవచ్చన్నారు. 50 కేజీల బస్తా రూ.267 అని చెప్పారు.

తల్లిపాల ఆవశ్యకతపై అవగాహన



తల్లిపాల ప్రాముఖ్యత గురించి వివరిస్తున్న విద్యార్థులు

తవణంపల్లె: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సోమవారం అరగొండ అపోలో నర్సింగ్ కాలేజ్ బీఎస్సీ నర్సింగ్ విద్యార్థులతో తల్లిపాల ఆవశ్యకతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పీహెచ్‌సీకి విచ్చేసిన గర్భిణులు, బాలింతలు, మహిళలకు తల్లిపాల ప్రాముఖ్యత గురించి వివరించారు. ఆరోగ్య విద్య, అంటువ్యాధులు, వ్యక్తిగత శుభ్రత తదితర విషయాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అపోలో నర్సింగ్ కాలేజ్ ఎన్‌ఎస్‌ఎస్ అధికారిణి శోభారాణి, విద్యార్థులు(ఎన్‌ఎస్‌ఎస్) పాల్గొన్నారు.

'డాయ్' బాధితుల ఆందోళన

- న్యాయం చేయాలని వినతి



ప్లకార్డులతో ఆందోళన చేస్తున్న డాయ్ యాప్ బాధితులు

పలమనేరు: మున్సిపాలిటీలోని మెప్మా ఆర్పీలు, కంప్యూటర్ ఆపరేటర్ రాజేష్ కారణంగా డాయ్ యాప్‌లో లక్షలు కట్టి మోసపోయామని, తమకు న్యాయం చేయాలంటూ కోరుతూ సోమవారం స్థానిక ఆర్డీఓ కార్యాలయం వద్ద పలువురు డాయ్ యాప్ బాధితులు ఆందోళన చేశారు. వారు మాట్లాడుతూ, యాప్ చేసిన మోసంపై ఇటీవలే కలెక్టర్ ఏర్పాటు చేసిన కమిటీకి సైతం తాము ఫిర్యాదు చేశామన్నారు. దీనిపై ఇప్పటివరకూ ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. దీనికి కారణమైన రాజేష్‌ను పోలీసులు ఎందుకు అరెస్ట్ చేయలేదని ప్రశ్నించారు. అనంతరం ఆర్డీఓ కార్యాలయ అధికారులకు వినతి పత్రం అందజేశారు.

భూ ఆక్రమణపై నిరసన



మాట్లాడుతున్న తహసీల్దార్ మాధవరావు

బైరెడ్డిపల్లె: తమ భూమిని ఆక్రమించుకుని ఏళ్ల కాలంగా వేధిస్తున్నారని మండలంలోని తాతిరెడ్డిపల్లెకు చెందిన వెంకటలక్ష్మమ్మ కుటుంబీకులు సోమవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేశారు. వారు మాట్లాడుతూ, తమ గ్రామ లెక్క దాఖలా 174/7లో విస్తీర్ణం 2.05 ఎకరాలు ఉందన్నారు. తమ గ్రామానికి చెందిన ఓ వ్యక్తి రికార్డుల్లో తారుమారు చేసి అతని పేరిట మార్చుకుని వేధిస్తున్నాడని, భూమి లేకపోతే తాము జీవనాధారం కోల్పోతామని తమ గోడు నివేదించారు. స్పందించిన తహసీల్దార్ మాధవరావు రికార్డులు పరిశీలించి న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో నిరసనకు తెరపడింది.

పలమనేరు ఆర్టీసీ డిపో పరిరక్షణకు చర్యలు ప్లీజ్!



పలమనేరు: నిర్వీర్యమై పోతున్న పలమనేరు ఆర్టీసీ డిపో పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని సోమవారం స్థానిక ఆర్టీసీ డిపో ముందు పలమనేరు పరిరక్షణ సమితి నాయకులు ఆందోళన చేశారు. సమితి అధ్యక్ష, కార్యదర్శులు సుబ్రమణ్యం పిళ్లై, నరసింహులు మాట్లాడారు. గతమెంతో ఘనకీర్తి కలిగిన పలమనేరు డిపోలో బస్సులు లేక, ఉన్న బస్సులను పక్క డిపోలకు తరలించడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. పలమనేరు నుంచి సీఎంసీకి వెళ్లాలన్నా, లేదా బెంగళూరు, చెన్నై, తిరుపతిలకు సైతం ఎక్స్‌ప్రెస్ బస్సు సర్వీసులు లేక అవస్థలు తప్పడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమస్యపై తాము ఇప్పటికే స్థానిక ఎమ్మెల్యే అమరనాథ రెడ్డికి సైతం విన్నవించినా ఫలితం లేదన్నారు. కనీసం ఆర్టీసీ ఉన్నతాధికారులైనా స్పందించి, పలమనేరు డిపోలో సర్వీసులను పెంచి, ప్రయాణికులకు సేవలందించాలని డిమాండ్ చేశారు. అనంతరం అధికారులకు వినతి పత్రం ఇచ్చారు.

ఊపిరి తీస్తోంది..!

ఊపిరితిత్తులు మనిషి శ్వాసక్రియకు ఎంతో కీలకం. శ్వాస తీసుకోవడంలో క్షణం ఆలస్యమైనా ప్రమాదమే. ఊపిరితిత్తులకు క్యాన్సర్ సోకితే గుర్తించడం కష్టం. నేడు చెడు అలవాట్లతో ఎక్కువ మంది క్యాన్సర్ బారిన పడుతున్నారు. ముఖ్యంగా లంగ్ క్యాన్సర్ బాధితుల సంఖ్య ప్రతి ఏటా పెరుగుతోంది. ఈ వ్యాధిని ఎంత త్వరగా గుర్తిస్తే అంత మేలని వైద్యనిపుణులు హెచ్చరిస్తున్నారు. అలాగే చెడు అలవాట్ల జోలికి వెళ్లొద్దని సూచిస్తున్నారు. –కాణిపాకం

- చెడు అలవాట్లతో ఊపిరితిత్తుల సమస్య
- క్యాన్సర్‌కు దారితీస్తున్న వైనం
- పెరుగుతున్న లంగ్ క్యాన్సర్ కేసుల సంఖ్య



ఓపీ చేస్తున్న వైద్యులు

మనిషిలో శ్వాస ఆడకపోతే ప్రాణం పోతుంది. క్షణం పాటు ప్రాణవాయువు అందకపోతేనే ఉక్కిరిబిక్కిరి అవుతాం. ఇందులో ఊరిపితిత్తులు కీలక భూమికను పోషిస్తాయి. నేడు ఎక్కువ మంది ధూమపానం చేస్తూ క్యాన్సస్ ముప్పును కొని తెచ్చుకుంటున్నారు. చిత్తూరు జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి ఊపిరితిత్తుల సమస్యతో వచ్చే వారి సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. ఓపీ కోసం క్యూకడుతున్నారు. ప్రతినెలా ఊరిపితిత్తుల సమస్యతో 985 మంది ఓపీకి వస్తున్నారు. అలాగే స్క్రీనింగ్ టెస్టులకు 650 మందికి పైగా వస్తున్నట్లు అధికారిక లెక్కలను బట్టి తెలుస్తోంది. దీంతో పాటు ప్రైవేటు ఆస్పత్రులకు 2000 వేలమందికి పైగా వస్తున్నట్లు నిపుణులు చెబుతున్నారు.

సాధారణ లక్షణాలు

లంగ్ క్యాన్సర్ వచ్చిన వారినిలో సాధారణంగా ఊపిరి తీసుకోవడం కష్టంగా ఉంటుంది. బాగా దగ్గు రావడంతోపాటు గళ్లలో రక్తం పడుతుంది. ఆకలి, బరువు తగ్గడం, అలసట, ఛాతీలో, పొట్టలో నొప్పి ఉంటుంది. ఏదైనా తినేటప్పుడు మింగడానికి ఇబ్బంది పడాల్సిన పరిస్థితి ఉంటుంది. ఊపిరితిత్తుల క్యాన్సర్‌లో స్మాల్ సెల్ లంగ్ క్యాన్సర్, నాన్ స్మాల్ షెల్ లంగ్ క్యాన్సర్, క్యాన్సర్ వచ్చిన భాగం నుంచి ఇతర అవయవాలకు వ్యాప్తి చెందే క్యాన్సర్ రకాలు ఉన్నాయి.

వ్యాధి నిర్ధారణ పరీక్షలు

క్యాన్సర్ లక్షణాలు ఉన్నవారికి ముందుగా ఛాతీ ఎక్స్‌రేతో పాటు బయాప్సీ చేస్తారు. అలాగే సీటీ స్కాన్, పెట్ సీటీస్కాన్ చేయాల్సి ఉంటుంది. కళ్లెను పరీక్షించడంతో పాటు, ఊపిరితిత్తుల పనితీరును తెలిపే స్పైరోమెట్రీ పరీక్షతోపాటు లంగ్స్‌ను ఎండోస్కోపీతో పరీక్షించే బ్రాంకోస్కోపీ, రక్తపరీక్షల వంటివి చేస్తారు. తద్వారా క్యాన్సర్ లంగ్స్‌లోని ఏ ప్రాంతానికి క్యాన్సర్ సోకింది, దాని స్టేజ్, గ్రేడ్‌లను నిర్ధారించి చికిత్స మొదలుపెడతారు.

చికిత్స ఇలా...

ముందుగా క్యాన్సర్‌ను గుర్తిస్తే, లోబెక్టమీ చేసి లంగ్‌లో క్యాన్సర్ వచ్చిన భాగాన్ని తొలగిస్తారు. నాన్ స్మాల్ సెల్ క్యాన్సర్‌కు సర్జరీ చేస్తారు. స్మాల్ సెల్ లంగ్ క్యాన్సర్‌కు ఎక్కువగా వ్యాప్తి చెందే గుణం ఉంటుంది కాబట్టి రేడియోథెరపీ, కీమో వంటివి ఎంత కాలం తీసుకోవాలసి ఉంటుందో నిర్ణయిస్తారు. వయసు పెద్దదై క్యాన్సర్‌ను ఆలస్యంగా గుర్తిస్తే తీవ్రతను తగ్గించి వారు బతికి ఉన్నంత కాలం వీలైనంత ఉపశమనం దక్కేలా పాలియేటివ్ కేర్ అందిస్తారు.

నివారణ

పొగతాగడం మానేయడంతో పాటు పొగ తాగేవారికి దూరంగా ఉండాలి. అలాగే వాతావరణ కాలుష్యాన్నీ, నీటి కాలుష్యాన్నీ తగ్గించుకుంటే ఊపిరితిత్తులు పదిలంగా ఉంటాయి. ఊపిరితిత్తుల క్యాన్సర్, క్షయ వ్యాధి లక్షణాలు ఒకేలా ఉంటాయి. ముందుగా పరీక్షలు చేయించుకుని టీబీ అయినా, లంగ్స్ క్యాన్సర్ అయినా నిర్లక్ష్యం చేయకుండా వైద్యుల సలహా మేరకు నిర్ణీతకాలం చికిత్స తీసుకోవాలి. క్యాన్సర్ అయితే చికిత్స పూర్తయిన తర్వాత కూడా వైద్యుల పర్యవేక్షణలో కొనసాగుతూ ఉండాలి.

పొగాకు జోలికి వెళ్లొద్దు



జన్యువులు, వయసు వంటి ముప్పు కారకాల విషయంలో పెద్దగా చేయగలిగిందేమీ లేదు. కొన్ని జాగ్రత్తలతో ఊరిపితిత్తుల క్యాన్సర్‌ను నివారించుకునే అవకాశం ఉంది. పొగాకును ఏ రూపంలో వాడినా క్యాన్సర్ కారకమే. సిగరెట్లు, చుట్టలు, బీడీల జోలికి వెళ్లకపోవడం ఉత్తమం. వీటిని కాల్చే అలవాటుంటే మానేయాలి. గుట్కా నమిలే అలవాటున్నా వెంటనే వదిలేయాలి. లంగ్స్ లక్షణాలు కనిపిస్తే వైద్యులను సంప్రదించాలి. నిర్లక్ష్యం చేయకూడదు.

– నందీశ్వర్‌రెడ్డి, వైద్యనిపుణులు, చిత్తూరు జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి

తీగల తొలగింపు

సాక్షి ఎఫెక్ట్..

గుడిపాల: కరెంట్ స్తంభాలకు నిలువునా దట్టంగా ఉన్న తీగలు, కొమ్మలను ట్రాన్స్‌కో అధికారులు తొలగించారు. సోమవారం సాక్షి దినపత్రికలో 'ప్రమాదమని తెలిసినా పట్టించుకోరా?' శీర్షికతో ప్రచురించిన కథనంపై ట్రాన్స్‌కో అసిస్టెంట్ ఇంజినీర్ కరీముల్లా స్పందించారు. ఆయన ఆదేశాలతో లైన్‌మెన్ బద్రి, ట్రాన్స్‌కో సిబ్బంది చర్యలు తీసుకున్నారు. చేతికందే ఎత్తులో ఉన్న విద్యుత్ వైర్లను కూడా పైకి లాగి కట్టారు. దీంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.



తీగల తొలగింపు అనంతరం ఇలా..

11న ఉభయదారుల సమావేశం

కాణిపాకం: కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని ఈ నెల 11వ తేదీన బ్రహ్మోత్సవ ఉభయదారుల సమావేశం నిర్వహించనున్నట్టు ఆలయ ఈవో వెంకటేశు తెలిపారు. కాణిపాక ఆలయ అనుబంధ ఆలయ శ్రీ మణికంఠేశ్వరస్వామి ఆలయంలో 11వ తేదీ మధ్యాహ్నం 2 గంటలకు సమావేశం ప్రారంభమవుతుందన్నారు. ఉభయదారులు పాల్గొనాలని పేర్కొన్నారు.

సమస్యలపై ఐదు వినతులు



వినతులు స్వీకరిస్తున్న అధికారులు

చిత్తూరు అర్బన్: చిత్తూరు నగరపాలక కార్యాలయంలో సోమవారం నిర్వహించిన 'ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక' కార్యక్రమంలో ఐదు వినతులు అందాయని నగర కమిషనర్ జె.అరుణ తెలిపారు. సహాయ కమిషనర్ రామకృష్ణుడు ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ప్రజారోగ్య విభాగం–1, మెప్మా–2, రెవెన్యూ–2 చొప్పున అందిన వినతులను సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో విచారణ చేసి పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ హెల్తాఫీసర్ డాక్టర్ అనిల్ కుమార్ నాయక్, మేనేజర్ గోపాలకృష్ణవర్మ, ఇతర విభాగాల అధికారులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ కార్యకర్తలకు అండగా ఉంటాం



బాధితులకు చెక్కులు అందజేస్తున్న డాక్టర్ సునీల్‌కుమార్

- పూతలపట్టు సమన్వయకర్త డాక్టర్ సునీల్‌కుమార్
- మొగిలివారిపల్లె బాధితులకు ఆర్థిక సాయం

బంగారుపాళెం: వైఎస్సార్‌సీపీ కార్యకర్తలకు పార్టీ అండగా ఉంటుందని, అధైర్య పడొద్దని పూతలపట్టు నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సునీల్‌కుమార్ తెలిపారు. మండలంలోని మొగిలివారిపల్లెలో టీడీపీ కార్యకర్తల దాడిలో గాయపడిన వైఎస్సార్ సీపీ కార్యకర్తలు అరుణ్ కుమార్, హరీష్, రాజాకు పార్టీ అధిష్టానం ఒక్కొక్కరికి రూ.50 వేల చొప్పున ఆర్థిక సాయం మంజూరు చేసింది. ఈ క్రమంలో సునీల్‌కుమార్ సోమవారం సాయంత్రం బంగారుపాళెంలో బాధితులకు చెక్కులు అందజేశారు. ఆయన మాట్లాడుతూ ప్రతి కార్యకర్తకూ జగనన్న అండగా ఉంటారని చెప్పారు. అధికారం చేపట్టిన రెండు నెలలకే టీడీపీ అరాచకాలు, దౌర్జన్యాలు మితిమీరిపోయాయన్నారు. వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, నాయకులపై దాడులు చేస్తున్నారని పేర్కొన్నారు. కార్యకర్తలు, నాయకులు ధైర్యంగా ఉండాలని పిలుపునిచ్చారు. అందరూ కలిసి కట్టుగా ఉండి వచ్చే ఎన్నికల్లో జగనన్నను ముఖ్యమంత్రిగా గెలిపించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ మాజీ చైర్మన్ కుమార్‌రాజా, సర్పంచ్ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

తిమ్మాపల్లెలో 'ఫ్యామిలీ డాక్టర్'



ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో డాక్టర్ రష్మిత

గుడిపాల: మండలంలోని తిమ్మాపల్లెలో సోమవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని బొమ్మసముద్రం వైద్యాధికారిణి రష్మిత నిర్వహించారు. గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలకు హిమోగ్లోబిన్ పరీక్షలు,అనంతరం బీపీ, షుగర్ ఉన్న వారికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను అందజేశారు. ఆరోగ్యశ్రీ పథకం కింద శస్త్ర చికిత్సలు చేయించుకున్న వారికి ఇళ్లకే వెళ్లి వారి ఆరోగ్యం ఎలా ఉందో అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది సరిత, శిల్ప, శివగామి, శ్రీలక్ష్మి పాల్గొన్నారు.

గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలి



వైద్య పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

ఐరాల: గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్ తెలిపారు. మండలంలోని 35 యర్లంపల్లెలో సోమవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. 104 వాహనంలో వైద్యాధికారి 80 మంది రోగులకు వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. గర్భిణులు, బాలింతలు, వృద్ధులు, చిన్న పిల్లలు, బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు పరీక్షలు చేశారు. నడవలేని స్థితిలో ఉన్న రోగుల ఇళ్ల వద్దకే వెళ్లి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకుని మందులు అందజేసి సూచనలు, సలహాలు ఇచ్చారు. వైద్యాధికారి మాట్లాడుతూ గర్భిణులు ప్రతి నెలా వైద్యుల సూచనల మేరకు వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. ఆరునెలల గర్భిణులు తప్పనిసరిగా ఈసీజీ పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ సుధాకర్, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

గ్రామీణ ప్రజలకు మెరుగైన వైద్యం

తవణంపల్లె: గ్రామీణ ప్రజలకు మెరుగైన వైద్యం అందిస్తున్నట్టు వైద్యాధికారి ప్రియాంక తెలిపారు. మండలంలోని పుణ్యసముద్రంలో సోమవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో భాగంగా ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. గర్భిణులు, బాలింతలు, వృద్ధులు, బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు 104 వాహనంలో పరీక్షలు చేసి మందులు అందజేశారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ శ్రీనివాసులు, ఏఎన్ఎం, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

మల్లకుంటలో 37 మందికి వైద్య పరీక్షలు

మండలంలోని మల్లకుంటలో సోమవారం వైద్యాధికారి వినయ్‌కుమార్ 37 మందికి వైద్య పరీక్షలు చేశారు. ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో భాగంగా మల్లకుంటలో పర్యటించి పరిసరాలు, మురుగు కాలువలను శుభ్రంగా ఉంచుకోవాలని స్థానికులకు సూచించారు. దోమ కాటుకు గురి కాకుండా దోమ తెరలు వాడాలని, వేప పొగ వేయాలన్నారు. అనంతరం వృద్ధులు, గర్భిణులు, బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు.

బంగారుపాళెంలో కుండపోత వర్షం



చెన్నై–బెంగళూరు జాతీయ రహదారిపై ప్రవహిస్తున్న నీరు



రహదారిపై నిలిచిపోయిన వాహనాలు



విద్యార్థినులతో మాట్లాడుతున్న తహసీల్దార్



ఎస్సీబాలికల హాస్టల్లోకి ప్రవేశిస్తున్న వర్షపు నీరు



వెలుపలకు వస్తున్న విద్యార్థులు

బంగారుపాళెం: మండల కేంద్రమైన బంగారుపాళెంలో సోమవారం సాయంత్రం కుండపోత వర్షం కురిసింది. సాయంత్రం 3.30 గంటలకు ప్రారంభమైన వర్షం 5.30 వరకు దంచి కొట్టింది. వర్షపు నీరు చెన్నై–బెంగళూరు జాతీయ రహదారిపై ప్రవహించడంతో వాహనదారులు అవస్థలు పడ్డారు. జాతీయ రహదారి పక్కనున్న లోట్టు ప్రాంతాల్లోకి వర్షపు చేరింది. ఇళ్లల్లోకి నీరు ప్రవేశించడంతో స్థానికులు అవస్థలు పడ్డారు. ఈ మధ్య కాలంలో ఇటువంటి భారీ వర్షం పడలేదని ప్రజలు తెలిపారు.

ఎస్సీ బాలికల హాస్టల్‌లోకి వర్షపు నీరు

వర్షపు నీరు స్థానిక ఎస్సీ బాలికల హాస్టల్‌లోకి చేరడంతో విద్యార్థులు ఇబ్బందులు పడ్డారు. బాలికల హాస్టల్ సమీపంలోనే తగ్గువారిపల్లె కుంట నుంచి ముంగరమడుగు చెరువుకు వెళ్లే సప్లయి చానల్ ఉంది. భారీ వర్షానికి కాలువ పొంగడంతో నీరు హాస్టల్‌లోకి వచ్చింది. వార్డెన్, సిబ్బంది విద్యార్థులను సురక్షిత ప్రాంతానికి తరలించారు. సమాచారం అందుకున్న తహసీల్దార్ బాబురాజేంద్ర ప్రసాద్, పంచాయతీ సిబ్బంది అక్కడికి చేరుకుని విద్యార్థులకు ధైర్యం చెప్పారు.



బంగారుపాళెంలో కురుస్తున్న వర్షం



వర్షంలో తడుస్తూ ఇళ్లకు వెళ్తున్న విద్యార్థులు



కాలువలో పొంగి పొర్లుతున్న నీరు

కుల రాజకీయాలకు కూటమి తెరలేపింది



మాట్లాడుతున్న యమలా సుదర్శనం

పలమనేరు: మాల, మాదిగల మధ్య చిచ్చుపెట్టి కుల రాజకీయాలకు కూటమి పార్టీలు తెరలేపాయని దీంతో మాలల ఉద్యమాలు తీవ్రతరం కావడం తథ్యమని మాల మహానాడు రాష్ట్ర నాయకులు యమలా సుదర్శనం హెచ్చరించారు. సోమవారం పట్టణంలోని ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌస్ వద్ద జిల్లా మాల మహానాడు నేతలతో కలసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణను తాము పూర్తిగా వ్యతిరేకిస్తున్నామన్నారు. మాల, మాదిగల మధ్య చిచ్చుపెట్టి రాజకీయ ప్రయోజనాల కోసం చంద్రబాబు, మోదీ కుట్ర పన్ని తమను మోసం చేశారన్నారు. రాష్ట్రాలకు వర్గీకరణ చేసే అధికారం ఏమాత్రం లేదని భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 341 స్పష్టంగా చెప్పిందన్నారు. దీనిని విస్మరించి సుప్రీం కోర్టు మోదీ ప్రభావిత తీర్పునిచ్చిందని ఆరోపించారు. కూటమి చేసిన మోసంతో రాష్ట్రంలోని మాలల బతుకులు రోడ్డున పడే పరిస్థితి ఉందని పేర్కొన్నారు. సుప్రీం తీర్పుపై తాము రివ్యూ పిటిషన్‌ను దాఖలు చేస్తామన్నారు. మాలలకు జరిగిన అన్యాయంపై గ్రామ, మండల స్థాయి నుంచి ఉద్యమాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. దీనిపై ఇప్పటికే కార్యాచరణకు పూనుకున్నట్టు తెలిపారు. సమావేశంలో రాష్ట్ర, జిల్లా మాల మహానాడు నాయకులు గ్యాస్ భాస్కర్, జైకుమార్ తదితరులు పాల్గొన్నారు.

దాతల సాయంతో అభివృద్ధి

వి.కోట: దాతల సహకారంతో స్కూల్‌ను మరింత అభివృద్ధి చేసి విద్యార్థులకు మెరుగైన విద్య అందించడానికి కృషి చేస్తున్నామని బాలికల ఉన్నత పాఠశాల హెచ్‌ఎం పరాశురాం తెలిపారు. ఇటీవల బాలికల ఉన్నత పాఠశాల ఆవరణలో విద్యార్థినుల సౌకర్యార్థం భోజనం చేయడానికి వీలుగా రూ.4లక్షలతో షెడ్ నిర్మాణానికి పట్టణానికి చెందిన సుప్రభాత్ యాక్ట్స్ సంస్థ అధినేత ఉదయ్‌సాగర్‌రెడ్డి సహకరించారని, గతంలో విద్యార్థులు ఎండలో ఎక్కడబడితే అక్కడ కూర్చునే పరిస్థితి ఉండేదని, ప్రస్తుతం షెడ్ నీడలో భోజనం చేస్తున్నారని తెలిపారు. అలాగే మండలానికి చెందిన వ్యాపారవేత్తలు దామోదరం రెడ్డి, పురుషోత్తం, పాతూరు సతీష్ 1,80,000 రూపాయల ఆర్థిక సాయంతో షెడ్ కింద మెట్లను నిర్మించినట్టు చెప్పారు. అలాగే ఉపాధ్యాయ బృందం సైతం రూ.3లక్షలు ఇవ్వడంతో ఆటస్థలం చదును, ఇతర అభివృద్ధి పనులకు వినియోగించినట్టు చెప్పారు.